క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన మేడా సోదరులు



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మేడా రఘునాథరెడ్డిలు

రాజంపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మేడా సోదరులు కలిశారు. శుక్రవారం రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జున రెడ్డి, ఎంఆర్‌కేఆర్ నిర్మాణ సంస్థ అధినేత మేడా రఘునాథరెడ్డిలు ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు.

'రంగోత్సవ్'లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

రామాపురం : జాతీయ స్థాయి కళా పోటీలు 'రంగోత్సవ్'లో రామాపురం డాక్టర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు ప్రతిభ చాటారు. 2023 సెప్టెంబర్ 23న జరిగిన నేషనల్ డ్రాయింగ్ విభాగంలో 40 మంది విద్యార్థులు పాల్గొనగా 20 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ వి.వి. ప్రసాద్ ఇక్కడి విలేకరులకు తెలిపారు. అనంతరం విద్యార్థులకు, ఆర్ట్ మాస్టర్ ఆనందరాజులకు పాఠశాల ఉపాధ్యాయుల బృందం అభినందనలు తెలియజేశారు.

రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం



మందులను అందజేస్తున్న ఎంపీడీఓ, వైద్యుడు

ఓబులవారిపల్లె : గ్రామీణ ప్రాంతాలలో రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడం జరుగుతుందని ఎంపీడీఓ విజయారావు పేర్కొన్నారు. శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా చిన్నఓరంపాడు సచివాలయ పరిధిలో వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించారు. ఎంపీడీఓ విజయారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా పేదలకు వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైద్యాధికారి గురుమహేష్, సూపరింటెండెంట్ రవి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

పెనగలూరు (ఓబులవారిపల్లె) : వికసిత్ భారత సంకల్ప యాత్ర పోస్టర్లను శుక్రవారం రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్ప యాత్రను అధికారులు విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బాలకుమార్, తహసీల్దార్ శ్రీధర్ రావు, ఎంపీడీఓ వరప్రసాద్, జెడ్పీటీసీ ధనుంజయ రెడ్డి, ఆంజనేయులు రెడ్డి, వెంకటేశ్వర ప్రసాద్, సుబ్బారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ గోడౌన్ తనిఖీ



గ్యాస్ గోడౌన్‌లో తహసీల్దార్ శ్రీధర్ రావు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రంలోని గ్యాస్ గోడౌన్‌ను శుక్రవారం తహసీల్దార్ శ్రీధర్ రావు, ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల పరంగా గోడౌన్‌లో ఎన్ని గ్యాస్ సిలిండర్లు ఉండాలో పరిశీలించారు. సిలిండర్ల అవకతవకలు ఉన్నాయని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు వారు తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్ఓ మౌలా తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత



కాలువలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

పుల్లంపేట : పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సర్పంచ్ పారిశుద్ధ్య పనులను చేయించారు. అనంతరం శుభ్రం చేసిన వీధులలో బ్లీచింగ్, సున్నంను చల్లించారు. వీధులలో మురికి నీరు నిల్వ ఉండకుండా శుభ్రపరిచామని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన దోమలు వృద్ధి చెందవని సర్పంచ్ తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపు చారిత్రాత్మకం

- రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం
- రూ.3వేల పింఛన్ పంపిణీలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు: పింఛన్లను పంపిణీ చేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



పుల్లంపేట: పింఛన్ల పంపిణీలో నాయకులు

రైల్వేకోడూరు : సామాజిక పింఛన్ల పెంపు నిర్ణయం చారిత్రాత్మకమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం పైన ఏర్పాటు చేసిన వైఎస్సార్ పింఛన్ల పెంపు, కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్ప పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి అవ్వాతాతలకు అండగా నిలిచారన్నారు. వారి మోముల్లో ఆనందం పంచారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను పక్కాగా అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశం అంతా మన రాష్ట్రం వైపు చూస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ప్రతి క్షణం పరితపించే వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పేదల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్నప్పటికీ లబ్ధిదారులు జన్మభూమి కమిటీ సభ్యుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వచ్చేదన్నారు. నేడు పింఛను కోసం పడిగాపులు పడాల్సిన పనిలేకుండా అర్హతే ప్రామాణికంగా ఇంటివద్దకే వచ్చి అందజేస్తున్నారని తెలిపారు. గత చంద్రబాబు పాలనకు, ప్రస్తుత జగనన్న పాలనకు బేరీజు వేసుకుని ప్రజలు జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పెన్షన్ లబ్ధిదారులకు నూతన సంవత్సర, ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్లు వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, మండల నాగేంద్రలు, ఎంపీడీఓ జాషువా, ఉప సర్పంచ్ తోట శివసాయి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, వైఎస్ అన్వర్‌బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, ముజీబ్, శివయ్య, సీహెచ్ రమేష్, దార్ల చంద్రశేఖర్, గోపి, జనార్దన్‌రాజు, బండారు మల్లి, రాజారెడ్డి, రమణారెడ్డి, చంగల్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట తప్పని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

పుల్లంపేట : చెప్పిన మాట ప్రకారం ఏడాదికి రూ. 250లు పింఛన్ పెంచుతూ రూ. 3 వేలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పెన్షన్ పెంపు, నూతనంగా మంజూరైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టని పథకాలు మన రాష్ట్రంలో సీఎం జగన్ ప్రవేశపెట్టి పేదల అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుత జగనన్న ప్రభుత్వంలో మండల వ్యాప్తంగా 5700 పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, మండల కన్వీనర్ ముస్తాక్, ఏపీటీడీసీ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, జెడ్పీటీసీ గీతారామనాథం, వైస్ ఎంపీపీ జయశంకర్, జేసీఎస్ కన్వీనర్ హరినాథ్ రెడ్డి, ఎస్సీ ఫైనాన్స్ డైరెక్టర్ మడగలం శ్రీను, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, ఆలం చెంగయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

వీరబల్లె (రాయచోటి టౌన్) : పౌష్టికాహారంతో మనం ఆరోగ్యంగా ఉండవచ్చుని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మహమ్మద్ అలీఖాన్ అన్నారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఓదివీడు గ్రామంలో పరిసరాలు - పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని సచివాలయం, పాఠశాలల పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు తొలిగించారు. అనంతరం సచివాలయంలోని విలేజ్ క్లినిక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం దాని ప్రయోజనాలు అనే అంశంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతులతోపాటు అందరూ పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పీవీ శివరాం, వలంటీర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రామాపురం : కల్పనాయిని చెరువు మాజీ సర్పంచ్ వెంకట సుబ్బారెడ్డి గుండెకు చికిత్స అనంతరం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నట్లు సమాచారంతో శుక్రవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, హుసేనయ్య, నారాయణరెడ్డి, చెన్నారెడ్డిలు పాల్గొన్నారు.

విద్యార్థి దశ అత్యంత కీలకమైంది

బీసీ గురుకుల పాఠశాలను నందలూరు జడ్జి లత ఆకస్మిక తనిఖీ



కూరగాయలను పరిశీలిస్తున్న జడ్జి లత

నందలూరు(రాజంపేట) : విద్యార్థి దశ అత్యంత కీలకమైందని, ఆ సమయంలో యువత చెడు ఆకర్షణకు లోను కాకుండా సన్మార్గంలో నడవాలని మండల సర్వీసెస్ కమిటీ చైర్మన్, నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోలార్ లత సూచించారు. శుక్రవారం ఆమె మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో హాస్టల్‌లో విద్యార్థులకు ఇస్తున్న సదుపాయాలు గురించి ఆరా తీశారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ భోజనం అందుతుందా లేదా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని పరిశీలించి వంట సామగ్రి నాసిరకంగా ఉండటం చూసి అసహనం వ్యక్తం చేశారు. పిల్లలకు ఇలాంటివి పెడితే ఎలా అని ప్రిన్సిపాల్, సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం విద్యార్థులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఉండాలని, ఎటువంటి సమస్యలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలని, క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు జీవితాన్ని కాల రాస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్, కోర్టు కానిస్టేబుల్స్, కోర్టు స్టాఫ్, పీఎల్‌వీ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకటవ తేదీనే పింఛన్లు తలుపుతడుతున్నాయి



చక్రంపేటలో పింఛన్ పంపిణీ చేస్తున్న అజయ్ రెడ్డి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : అవ్వాతాతల సంతోషమే జగనన్న లక్ష్యమని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి అన్నారు. శుక్రవారం చక్రంపేట పరిధిలోని పింఛన్ లబ్ధిదారులకు ఆయన రూ. 3 వేలను పంపిణీ చేశారు. అజయ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు రూ. 3 వేలకు పెంచి అవ్వాతాతల మనస్సులలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు ప్రతి నెల ఒకటవ తేదీ తెల్లవారకముందే తలుపుతట్టి పింఛన్లు పంపిణీ చేసే విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రణాళిక రూపొందించారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్ రావు, ఎంపీడీఓ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, గుడ్ల వీరనారాయణ రెడ్డి, వెంకటేశ్వర ప్రసాద్, ముద్రపల్లి సర్పంచ్ శివనాయుడు, సుబ్బారెడ్డి, పొందలూరు మాజీ సర్పంచ్ ఆంజనేయరెడ్డిలతోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అవ్వాతాతల ఆనందమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రతి ఇంటా పెద్దకొడుకుగా సీఎం జగన్
- సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కట్టాలి
- పెన్షన్ పెంపు, నూతన పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



చిన్నమండెం: పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డి



గాలివీడు: లబ్ధిదారుకు పింఛన్ ఇస్తున్న దృశ్యం

గాలివీడు : అవ్వాతాతల ఆనందమే సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగిన పెన్షన్ల పెంపు, నూతన పెన్షన్ల పంపిణీలో ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ యదుభూషణ్ రెడ్డి, సీనియర్ నాయకులు ఖాదర్‌మొహిద్దీన్(ఎస్‌కే), సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా సీఎం జగన్ అవ్వా తాతలకు రాసిన లేఖను ఎమ్మెల్యే చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మలిసంధ్యలో ఆసరా కోసం ఎదురు చూసే అవ్వాతాతలకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒకరు చనిపోతే కానీ మరొకరికి పెన్షన్ ఇచ్చేవారు కాదన్నారు. మహానేత వైఎస్సార్ శాచురేషన్ పద్ధతిలో అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన సంవత్సరానికే రూ.250లు పెంచుతూ నేడు రూ.3వేలు అందించి మాట నిలబెట్టుకున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయే సమయంలో రాష్ట్రంలో 39లక్షలు పెన్షన్లు ఇస్తుండగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 66.34లక్షల మందికి పెన్షన్లు పంపిణీ అవుతున్నాయన్నారు. గాలివీడు మండలంలో 7,500 పింఛన్లు పంపిణీ అవుతున్నాయని తెలియజేశారు. ఇంత మొత్తంలో పింఛన్ల పంపిణీ ఏ రాష్ట్రంలో లేదన్నారు. ప్రభుత్వంలో మంచి జరిగింటేనే తోడుగా నిలవండి అని చెప్పిన ముఖ్యమంత్రి ఎన్నడూ చూడలేదని, అది వైఎస్ జగన్‌కు మాత్రమే చెప్పగలిగారని కొనియాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేది జగన్ అయితే, ఇచ్చిన హామీలను ఎవరికి కనపడకుండా చేసేది చంద్రబాబేని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ బండి చిన్నరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చిన్నమండెం : పేదల సంక్షేమమే జగన్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నమండెంలో పండుగ వాతావరణంలో పెన్షన్ల పెంపు, నూతనంగా మంజూరైన పెన్షన్ల పంపిణీలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లను పెంచి మాట నిలబెట్టుకున్నారన్నారు. నెలకు పెన్షన్ల కింద రాయచోటి నియోజకవర్గ పరిధిలో రూ.13 కోట్లు ఖర్చు అవుతోందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు గోవర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఏజాజ్ అలీఖాన్, సర్పంచ్ నజీర్‌అహ్మద్, కోఆప్షన్ మెంబర్ గౌస్‌సాబ్, జేసీఎస్ మండల కన్వీనర్ చుక్కా అంజనప్ప, ఎంపీటీసీలు రమేష్, శ్యామ్, వెంకటప్పనాయుడు, రెడ్డప్ప, శ్రీరాములు, రమణ, గంగులయ్య, సర్పంచులు, ముసల్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, లక్ష్మీరెడ్డి, జగన్నాదరెడ్డి, అఫ్రోజ్, దామోదర్, కళ్లు రమణ, ఉప సర్పంచులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఈశ్వరీదేవి ఆరాధనోత్సవాలు



ఆరాధనలో పాల్గొన్న స్వాములు

చిట్వేలి : కెఎస్ అగ్రహారంలో ఉన్న ఈశ్వరీ దేవి మఠంలో గురువారం ప్రారంభమైన ఆరాధనోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. అనంతపురం, ఉమ్మడి కడప జిల్లాలలోని అమ్మవారి మాలలను ధరించిన భక్తులు ఇరుముడితో గురువారం సాయంత్రం స్థానిక సాయివికాస్ పాఠశాలకు చేరుకున్నారు. శుక్రవారం అమ్మవారు జీవ సమాధి అయిన పవిత్ర దినం సందర్భంగా మఠానికి వచ్చిన భక్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం మహా అన్నదానం జరిపారు. మఠాధిపతి శ్రీ రంగయ్య స్వాములు, శ్రీపరిపూర్ణ నంద స్వామివారి ఆశీస్సులతో ఆరాధనోత్సవాలను వైభవంగా జరిపించామని అర్చకులు వినయ్ కుమార్ ఆచారి తెలియజేశారు.

నియామకం

చిన్నమండెం : మండల రెడ్డి కమ్యూనిటీ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా కరిమిరెడ్డి జనార్దన్‌రెడ్డిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్ల సమస్యల పట్ల అవగాహన కలిగి, రెడ్ల సమస్యలకు పరిష్కారం దిశగా, నిస్వార్థంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతను వమ్ము చేయనన్నారు. తన నియామకానికి సహకరించిన పెద్దలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. పలువురు జనార్దన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి



మదర్ థెరిస్సా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాలలో రాణించాలని నాగిరెడ్డిపల్లె జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు లలిత కుమారి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ స్కౌట్ గ్రూప్ 25వ వార్షికోత్సవం, సిల్వర్ జూబ్లీ వేడుకలలో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. నందలూరులోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం రాజంపేట పార్లమెంట్ స్థాయిలో సంస్థ అధ్యక్షులు వేపగుంట శ్యామ్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో ముందుగా మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ ఎం.నాగేంద్ర ప్రసాద్, లోక్‌మాన్ సింగ్, రాజేంద్ర కుమార్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో బాలు, సాదిక్, వినయ్ కుమార్, సంస్థ సభ్యులు జశ్వంత్, ప్రకాష్ రాజ్, రెడ్డి శేఖర్, మన్మధ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు వీధిలైట్ల వితరణ



లైట్లను అందజేస్తున్న కొరముట్ల, ధ్వజారెడ్డిలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని 20 పంచాయతీలకు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి రూ.6 లక్షల తన స్వంత డబ్బులతో వీధి లైట్లను అందించారు. శుక్రవారం వీటిని ప్రభుత్వవిప్ కొరముట్ల చేతులమీదుగా ఆయా గ్రామాల సర్పంచ్‌లకు అందజేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ధ్వజారెడ్డి ప్రభుత్వ విప్ అభినందించారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలతో దిగుబడి



సస్యరక్షణ చర్యలను తెలియజేస్తున్న ఉద్యాన అధికారిణి నాగమణి

లక్కిరెడ్డిపల్లె : మామిడి తోటలలో పూత, పిందె దశలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించుకోవచ్చని లక్కిరెడ్డిపల్లె ఉద్యానశాఖ అధికారిణి నాగమణి పేర్కొన్నారు. మండలంలోని కోనంపేట, బి.ఎర్రగుడి, దప్పేపల్లి గ్రామాలలో ఉద్యానశాఖ అధికారిణి ఆధ్వర్యంలో మామిడిపూత, పిందె సమయంలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పూత త్వరగా ఒకేసారి రావడానికి, ఆడపూల శాతం పెరగడానికి 13-0-45 (మల్టీకే) 10 గ్రాములు లీటర్ నీటికి మ్యాంగో స్పెషల్ 5 గ్రాములు లీటర్ నీటికి లేదా ఫార్ములా-4 (5 గ్రాములు) లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. మామిడిలో పూమొగ్గ దశలో తేనెమంచు పురుగు, మసి తెగులు, పక్షి కన్ను తెగులు, బూడిద తెగులు ఆశించే అవకాశం ఉందని వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్ ఒక లీటర్ నీటికి, మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటర్ నీటికి పిచికారీ చేయాలని సూచించారు. పచ్చిపూత దశలో ఆశించే తేనెమంచు పురుగు, బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు నివారణకు బుప్రోఫెజిన్ 1.5 మిల్లీ లీటర్ నీటికి, కంటాఫ్ 2 మిల్లీ లీటర్ నీటికి అజాడిరెక్టిన్ 2 మిల్లీ లీటర్ నీటికి పిచికారీ చేయాలని రైతులకు తెలిపారు. తెల్లపూత దశలో ఎలాంటి రసాయన మందులు పిచికారీ చేయకూడదని తెలిపారు. మామిడి నల్లపూత దశలో పిందె బఠాణీ గింజ సైజులో ఉన్నప్పుడు ఆశించే తేనెమంచు పురుగు, తామర పురుగు, బూడిద తెగులు, పక్షికన్ను తెగులు, పిందె రాలడం ఉంటే నివారణకు బుప్రోఫెజిన్, ఎపిఫెట్ 1 గ్రాము లీటర్ నీటికి సాఫ్ 2 గ్రాములు లీటర్ నీటికి, ప్లానోఫిక్స్ 0.25 మిల్లీ లీటర్ నీటికి పిచికారీ చేయాలని రైతులకు తెలియజేశారు. మామిడి పిందెలు గోలికాయ నుంచి నిమ్మకాయ సైజు ఉన్నప్పుడు 10 సంవత్సరాలు పైబడిన చెట్లకు రెండోసారి ఎరువులు అనగా యూరియా 1 కేజీ, పొటాష్ 750 గ్రాముల చొప్పున చెట్లకు భూమిలో వేసి ఫిబ్రవరి, మార్చి నెలల్లో నీటి తడులను 15 రోజులకు ఒకసారి ఇవ్వాలన్నారు. మామిడి గోలికాయ దశ నుంచి నిమ్మకాయ దశ వరకు ఆశించే తొడిమ కుళ్లు తెగులు నివారణకు అమిస్టార్ 1 మిల్లీ లీటర్ నీటికి లేదా నాటివో ఒక గ్రాము లీటర్ నీటికి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సహాయకులు హరిత, అనూష, రమేష్, పావని, రైతులు పాల్గొన్నారు.